# అనుదిన పరిశుద్ధ లేఖన ప్రకాశం

**ఆధ్యాత్మిక మాసపత్రిక**

ఆదివారపు సందేశాలు - అనుదిన ధ్యానసూచనలు

**సంచిక : 4 సంపుటి : 2 అక్టోబర్ 2008**



సంపాదక వర్గం :

**ప్రధాన సంపాదకులు:**
జ్యోతిప్రకాష్ ఈతకోటి

**సంపాదకులు:**
డా॥ దేవకుమార్ సరిపెల్లి

**సహాయ సంపాదకులు:**
డా॥ టి.డి. వినయ్‌సాగర్
జయపాల్ మన్నవ

**ముఖ్యసలహాదారులు:**
డా॥ ఎడ్గర్ సాతులూరి
రెవ. బోడా సాలోమోన్
బ్ర. జి.ఆర్.ప్రకాష్

**సర్క్యులేషన్ మేనేజర్స్:**
అరుణ్ ప్రకాష్ ఈతకోటి
ప్రదీప్ కుమార్ బోదల

సాలు చందా: రూ॥100/-
జీవిత చందా : రూ.1000/-



మా అడ్రస్ :
**ప్రధాన సంపాదకులు**
జ్యోతిప్రకాష్ ఈతకోటి
ఇ.నెం.8-3-191/174, (71B),
వెంగళరావు నగర్,
హైదరాబాద్-500 038,
ఫోన్స్ : 040-23811211
సెల్ : 9391366670
ఇ-మెయిల్ :
jpethakoti@gmail.com


### సంపాదకీయం

## సంస్కరణోద్యమం (1483-1546)

సంస్కరణోద్యమ పితామహుడు మార్టిన్ లూథర్ జర్మనీ దేశంలోని ఎసిల్‌బెన్‌లో 1483వ సంవత్సరంలో జన్మించాడు. 1505లో ఎర్‌ఫోర్ట్ యూనివర్సిటిలో న్యాయశాస్త్రాన్ని అభ్యసిస్తున్నప్పుడు ఉరుములు మెరుపులతో కూడిన జడివానలో ఇరుక్కునిపోయి, “నాకు సహాయం చేయి సెయింట్ ఆన్, నేను మఠవాసినవుతాను” అని మ్రొక్కుకున్నాడు. రెండు వారాల తరువాత తన తండ్రి వద్దంటున్నా వినకుండా ఎర్‌ఫోర్ట్‌లో అగస్టీనియన్ మఠంలో చేరాడు. 1504 యాజకునిగా అభిషేకింపబడి 1512లో దైవజ్ఞాన శాస్త్రంలో డాక్టరేట్ పట్టాను తాను పొందాడు. 1513లో విటన్‌బర్గ్ విశ్వవిద్యాలంలో దైవజ్ఞానాన్ని బోధించుటకు ఆహ్వానించబడ్డాడు. యాజకుడనైన నేను పాపినే అనే భావన లూథర్‌కు కలిగింది. 1515లో విటన్‌బర్గ్ గోపురంలో రోమా 1:17 “నీతిమంతుడు విశ్వాస మూలంగా జీవించును” అను మాటను అర్థం చేసుకొనడం మొదలుపెట్టి “తాను తిరిగి జన్మించి, పరలోకంలోకి తెరువబడిన ద్వారం గుండా ప్రవేశించాను” అని ఆ తరువాత చెప్పిన దీనినే “టవర్ అనుభవంగా” వర్ణించాడు.

లూథర్ 95 అంశాలను గూర్చి కాథోలిక్ సంఘం చర్చించాలి అని వాటిని విటన్‌బర్గ్ ద్వారానికి అంటించాడు. అయితే కాథోలిక్ సంఘాన్ని విడిచివెళ్ళే ఉద్దేశ్యం ఆయనకు లేకుండెను. పాప క్షమాపణ పత్రాల అమ్మకాన్ని లూథర్ ఖండించాడు. అంతేకాక యేసు ద్వారా మాత్రమే పాప క్షమాపణ కలుగునని, రక్షణ ఉచితమని దానికొరకు చర్చికి ఏమి చెల్లించనక్కర లేదని ప్రకటించాడు. ఈ విషయాలు కాథోలిక్ మత నాయకులకు మింగుడు పడక లూథర్ తన వైఖరిని





మార్చుకోవాలని హెచ్చరించారు. అందుకు అంగీకరించనందు వలన 1520లో లూథర్‌ను పోపు సంఘం నుండి బహిష్కరించారు.

1529లో డైట్ ఆఫ్ స్పియర్స్ వద్ద అయిదవ చక్రవర్తి చార్లెస్ లూథర్ ఉద్యమాన్ని బలవంతంగా ఆపివేయాలని ప్రయత్నించాడు. అయితే జర్మనీలోని కొంతమంది రాజులు అణచివేతను ఆపి వేయమని ధర్నా (ప్రొటెస్ట్) చేశారు. అందుకే ఈ ఉద్యమానికి ప్రొటెస్టెంట్ అని పేరువచ్చింది. కాథోలిక్ సంఘంలో సంస్కరణ తెచ్చుటకు ఉద్దేశించిన ఉద్యమం పూర్తిగా మరో శాఖగా ఆవిర్భవించింది. దీనినే సంస్కరణోద్యమం అని పిలుస్తాం.

1525లో మార్టిన్ తన నలభై ఒకటవ ఏట 26 సంవత్సరాల వాన్‌బోర్‌కు చెందిన కాథరీన్‌ను పెండ్లి చేసుకున్నారు. ఆరుగురు సంతానంతో పాటు నలుగురు అనాథ పిల్లలను కూడా పెంచి పెద్ద చేశారు ఆ దంపతులు. తాను పుట్టిన పట్టణంలోనే తన 63వ యేట ఎసిల్‌బెన్‌లో లూథర్ మరణించాడు.

లూథర్ విశేష ప్రతిభ గల బైబిలు పండితుడు. ప్రతిరోజు ఉదయం రెండ గంటలు ప్రార్థనలో గడిపేవాడు. సంఘ చరిత్రలో ప్రముఖమైన పాత్రను పోషించిన మహాఘనుడు లూథర్.

లేఖనాలదే ఏ విషయంలోనైనా అంతిమ నిర్ణయం అని (సోలా స్క్రిప్చూరా) విశ్వాసం మూలంగానే నీతిమంతులుగా తీర్చబడతాం (సోలఫీడ), మరియు విశ్వాసులందరూ యాజకులే అని ఆయన బోధించాడు.

లూథర్ గొప్ప రచయిత. సుమారు ఐదువందలకుపై చిలుకు గ్రంథాలను రచించాడు. 28 కీర్తనలను వ్రాశాడు. హిబ్రూ, గ్రీకు భాషలనుండి బైబిలును జర్మని భాషలోకి అనువదించాడు. యాజకేతరులకు, క్రైస్తవ సిద్ధాంతాలను బోధించుటకు మతోపదేశాన్ని రచించాడు.

మార్టిన్ లూథర్ గారికి మనం ఇవ్వగల నీరాజనం ఏమంటే 1. దేవుడు కృపాహస్తములతో మనకందిస్తున్న రక్షణను స్వీకరించడం. 2. మన జీవిత మరియు సంఘ దేవాలయాలను దేవుని వాక్యంతో కట్టుకోవడం. 3. చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచిన ఆ దేవాది దేవుని గుణాతిశయములను అందరం, యాజకులు, యాజకేతరులు అను బేధం లేకుండా ప్రచురించడం.

లోక రక్షణలో మన పాత్రను మనం యేసుతో కలిసి నెరవేర్చుడానికి నేడే కంకణం కట్టుకుందాం. ప్రభువు ఉన్నత ఆజ్ఞను శిరసావహించు సంఘాలుగా మన సంఘాలను సంస్కరించుకుందాం.

**దేవుడు మిమ్మును దీవించును గాక !**

క్రీస్తు నందు మీ సేవకుడు
**జ్యోతిప్రకాష్ ఈతకోటి**

**5-10-08**

## లౌకిక సమాజంలో - క్రైస్తవ్య ఉనికి

**( ఆది 41:8-30, కీర్త. 100, అ.కా.11:19-26, మార్కు 5:1-20)**

**స్తుతి ఆరాధన : కీర్తన 100**

రండి ఉత్సహించి పాడుదాం అన్న పాట మీరు పాడునప్పుడు మీరు లేఖనాలను పాడుతున్నారని జ్ఞాపకం చేసుకోండి. మనం దేవునిని ఏ విధంగా ఆరాధించాలో ఈ కీర్తన తెలియజేయును.

1. **ఎవరు ఆయనను ఆరాధించాలి :** సమస్త దేశములు ఆయనను ఆరాధిస్తూ సన్నుతించాలని దేవుడు కోరుతున్నాడు.

2. **ఎలా ఆయనను ఆరాధించాలి :** ఆయనను సేవిస్తూ ఆరాధించాలి. పాడుతూ ఆరాధించాలి. ఆయనకు విధేయులమవుతూ ఆరాధించాలి. చివరగా కృతజ్ఞతార్పణలతో ఆయనను ఆరాధించాలి.

ఆయనను సేవిస్తూ ఆరాధించడం అంటే ఇష్టపూర్వకంగా సంతోషంగా ఆయనను మాత్రమే ఆరాధించడం. ఆయనకు విధేయులమవుతూ ఆరాధించడం అంటే సృష్టి-సృష్టికర్తకు, పిల్లలు-తండ్రికి, గొఱ్ఱెలు-కాపరికి ఏవిధంగా లోబడి ఉంటాయో ఆ విధంగా ఆయనకు లోబడడం. కృతజ్ఞతార్పణలతో ఆయనను ఆరాధించడం అంటే విరిగి నలిగిన హృదయాన్ని (కీర్తన 51:17), సజీవ యాగంగా మన శరీరాన్ని (రోమా 12:1), సత్క్రియలను అర్పణలను ప్రీతికరమైన ఇష్టమైనయాగంగా మన ధనాన్ని (ఫిలిప్పి 4:18) ఆయనకు అర్పించి ఆరాధించడం.

3. **ఆయనను ఎందుకు ఆరాధించాలి :** ఆయన దయాళుడు, ఆయన కృప నిత్యముండును. ఆయన సత్యము తరతరములుండును. కనుక క్రైస్తవ జీవితంలో ఉత్కృష్టమైన పని దేవునిని ఆరాధించడం. కనుక మన ఆరాధన యాంత్రికంగా అలవాటు ప్రకారం జరిగేది కాకుండా మనం జాగ్రత్త పడాలి.

### సందేశము

తన కొరకు లోకంలో మార్పును తెచ్చేవారిగా ఉండుటకు యేసు మనలను ఈ లోకంలోనికి పంపుతున్నాడు అని ఒక గొప్ప దైవజనుడు అన్నాడు. మనం మొదట మారడం ద్వారా ఆ పని ప్రారంభిస్తాం. తరువాత కుటుంబంలో, ఆ తరువాత సంఘంలో మరియు చివరగా లోకంలో. ప్రతిదశ మనలను తరువాత దశకు సిద్ధపరుస్తుంది. దేవుని సహాయంతో క్రీస్తు ప్రభువు తీసుకురాగల మార్పును గూర్చి మనం లోకంలో పంచుకోగలం.





మనం లౌకిక సమాజంలో ఉన్నాం. మన చుట్టూ అనేక మతాలవారున్నారు. లోకంలో ఉన్నదంతా, శరీరాశ, నేత్రాశ, జీవపు డంబమనే చీకటి. అయితే క్రైస్తవులు లోకానికి వెలుగై యున్నారు. చీకటిలో ఉన్న దీపం, నేనున్నానని చెప్పుకోనక్కరలేదు. తానిచ్చే కాంతి ద్వారా, అక్కడ దీపం ఉందని అందరు తెలుసుకుంటారు. ఆ విధంగానే క్రైస్తవులమైన మన ఉనికి ఈ లోకంలో ఉండాలి. ఐగుప్తు నిండా చిమ్మ చీకటి ఉండగా, ఇశ్రాయేలీయుల ఇంట్లో వెలుగు ఉండింది. వెలుగు విరజిమ్ముతున్న ఆ ఇల్లు ఇశ్రాయేలీయులదని ఎవరైన గుర్తిస్తారు. అదే విధంగా ఈ చీకటి లోకంలో, క్రైస్తవ గృహాలుండాలి. క్రైస్తవ్యం, భారతదేశానికి వచ్చినపుడు, నిస్వార్థంతో భారతదేశానికి వచ్చిన మిషనరీలు స్థాపించిన ఆసుపత్రులు, పాఠశాలలు, సేవా ఆశ్రమాల ద్వారా వారు చూపించిన దేవుని ప్రేమ ద్వారా, తన ఉనికిని చాటుకున్నది. పదిమందిని ఆ వెలుగులోనికి ఆకర్షించింది. వారు వెలిగించి వెళ్ళిన దీపాలన్నిటిని నేడు మనం ఆర్పివేసాం. మనం లోకంలో, చీకటిలో కలిసి పోయాం. దేశము పాడుకాకుండునట్లు, ప్రాకారాలను దిట్టపరచుటకు బద్దలైన సందులలో నిలుచుటకు ఎవరూ యెహెజ్కేలు కాలములో దేవునికి కనబడలేదేమో గాని, ఆయన యందలి అచంచల భక్తి విశ్వాసము గల కొంతమంది, బద్దలైన సందులలో నిలిచి, ప్రాకారములు దిట్టపరచి దేశమును కాపాడిన సందర్భాలు బైబిలులో లేకపోలేదు. అటువంటి వ్యక్తి నేటి పాత నిబంధనలోని యోసేపు. సర్వ దేశాలకున్న దేవుని కృపా సమృద్ధికి మరియు ఆ సమృద్ధి అందరికి అందుబాటుల మధ్య ఉన్న ఈ సందు (gap) లో అనగా పడిపోయిన దేవుని గొప్ప సృష్టికి మరియు, మానవాళికైన దేవుని నూతన ప్రారంభాల మధ్య ఉన్న సందు (gap) లో నిలువబడడానికి పిలువబడిన వారే నేటి పత్రిక పాఠంలో క్రైస్తవులని పిలువబడిన క్రీస్తు శిష్యులు. తనలోని దయ్యాన్ని వెళ్ళగొట్టిన గెరాసేను వాస్తవ్యుడు యేసుతోనే వచ్చేస్తానంటే యేసు వెళ్ళి, దేవునికి తన వారికి మధ్యలో ఉన్న ఆ సందులో నిలవబడమని, ఆ వ్యక్తిని పంపించాడు నేటి సువార్త పాఠంలో. ఆ విధంగా బద్దలై పోయిన నీతి, గోడల సందులలో నిలువబడి, దేశము పాడవకుండా శాంతి, సమాధానం, సామరస్యం, సమానత్వం అనే ప్రాకారములను దిట్టపరచుటకు నేడు దేవుడు మనందరిని పిలుచుచున్నాడు. నేటి ముఖ్య ధ్యానాంశము అదే. ప్రతి ఒక్కరం దేవుని వాగ్దానం వాటి నెరవేర్పుకు మనం ఉన్న చోటనే బద్దలైన సందులలో నిలువబడగలం.

### పాత నిబంధన పాఠం: ఆది 41:8-36; మనతో ఉన్న దేవుడే మన గుర్తింపు

దేవుడు మనతో ఉంటే మనమెక్కడ ఉన్నా, అక్కడ పరిస్థితులు వేరుగా ఉంటాయి. మన చుట్టు ఉన్న ప్రజలు మనలోని ప్రత్యేకతను గుర్తిస్తారు. కొండమీద ఉన్న పట్టణము మరుగై యుండనేరదు కదా? (మత్త 5:14). అదేవిధంగా క్రీస్తును కలిగిన విశ్వాసులు వారు ప్రసరించు

కాంతిని బట్టి తమ ఉనికిని సమాజంలో చాటుతారు. యోసేపు ఎక్కడకి వెళ్తే అక్కడకు దేవుడు వెళ్ళాడు. యెహోవా యోసేపుకు తోడై యుండెను. గనుక అతడు వర్ధిల్లుచుండెను అని వాక్యంలో చూస్తాం (అ.కా. 39:2). అదే పోతీఫరు ఇల్లేకానివ్వండి, చెరసాలే కానియ్యండి. అడవిలోని గుంటే కానివ్వండి. అక్కడకు యోసేపుతో పాటు దేవుడు కూడా వెళ్ళాడు.

మనం దేవుని ఆలయాలం అని మనలో పరిశుద్ధాత్మ దేవుడు నివసిస్తాడని మర్చిపోయారా? కనుక మనం ఎక్కడ ఉంటే అక్కడ దేవుడుంటాడు. ఎక్కడ దేవుడుంటే అక్కడ సంపూర్ణ సంతోషం ఉంటుంది. అది చెరసాలే అయినా సుఖంగా నిద్రపోగలం (కీర్త. 16:11). మన ముఖాలలో ఉన్న ఆనందపు నవ్వును బట్టి, మనం ప్రదర్శించు ధైర్యమునుబట్టి; అందరు మనం యేసుతో ఉన్నామని గుర్తిస్తారు (అ.కా. 4:13). యోసేపు ఎక్కడికి వెళ్తే అక్కడ అతనిలో ఉన్న ప్రత్యేకతను అందరు గుర్తించేవారు. మనచుట్టు ఉన్నవారు సిగరెట్టు తాగుతారు, మద్యం తాగుతారు, లంచాలు తీసుకుంటారు. అటువంటి సమాజంలో మనకు క్రీస్తు ఇచ్చిన నీతిని బట్టి, మనం చేయ సత్కార్యములను చూసి అమ్మో ! వీళ్ళు సర్వోన్నతుని దేవుని ప్రజలని, తెలుసుకుంటారు. అలాకాకుండా మనం కూడ, వాళ్ళవలే సిగరెట్లు త్రాగుతూ, మద్యం త్రాగుతూ, లంచాలు తీసుకుంటుంటే వాళ్ళకు, మనకు తేడా ఏం కనిపిస్తుంది? అందుకే మీ పరలోకపు తండ్రి పరిశుద్ధుడు గనుక మీరును పరిపూర్ణులై యుండుడని శిష్యులకు తెలియజేసి ప్రభువు నేడు మనకు తెలియజేస్తున్నాడు (మత్త. 5:48).

యోసేపు ఎక్కడ వున్నా దేవుని యందలి అచంచల భయభక్తులు కలిగి ఉన్నాడు. అందుకే అతడు ఎక్కడ వుంటే అక్కడ సఫలుడుగా ఉన్నాడు. ఫరో కనిన కలలు యోసేపు వివరించి చెప్పుటయే గాక, ఆ రాబోయే క్షామకాలంను ఎదుర్కొనడానికి ఏం చెయ్యాలో కూడా అతనికి తెలియజేయగా, యోసేపును దేవుని ఆత్మ కలిగినవాడుగా ఫరో గుర్తించాడు. ఎందుచేతనంటే యోసేపు (అతనిలో నివసిస్తున్న పరిశుద్ధాత్మ దేవుని సహాయంతో) జ్ఞానవివేకములను ప్రదర్శించాడు. ఆ విధంగానే మనం అందరం, మన పాపమును విడిచిపెట్టి, యేసును అంగీకరించి, ఆయనను కలిగి ఉంటే, మనం ఎక్కడకు వెళ్తే అక్కడ క్రీస్తు సువాసన వెదజల్లుతాం. ఆ విధంగా ప్రతి స్థలమందు క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసన కనపరచుచు, ఎల్లప్పుడు అజేయులంగా ఈ లోకంలో ఉండగలం (2 కొరి. 2:14,15). ఆ విధంగానే, ఆది సంఘంలోని ప్రతి శిష్యుడు ఉన్నట్లు నేటి పత్రిక పాఠంలో కనుగొంటాం. మనం నోరు విప్పితే, సిగరెట్టు, చుట్ట, సారా వాసన వస్తుందా? క్రీస్తును గూర్చిన జ్ఞానం వాసన వస్తుందా? ఏ వాసన వస్తుంది?





## పత్రిక పాఠం: అ.కా. 11:19-20; క్రీస్తును వెంబడించువారిని ఎవరైనా గుర్తిస్తారు

ఆది సంఘం స్తెఫను విషయంలో కలిగిన శ్రమను బట్టి, చాలామంది ఫెనికయ, కుప్ర, అంతియొకయ ప్రాంతాలకు చెదరి పోయారు. అయితే యోసేపుకు తండ్రియైన దేవుడు ఏ విధంగా తోడుగా ఉన్నాడో, వీరికి కుమారుడైన దేవుడు తోడుగా ఉన్నాడు. వారు ఎక్కడకు వెళ్తే అక్కడ అనేకులు ప్రభువైన యేసును అంగీకరించేవారు. మరి మనం ఎందుకు ఆ పని చేయలేక పోతున్నాం. కారణం చాలా స్పష్టం. దేవుడు మనతో ఉంటే కదా? ఆరోజులలో సంఘాలలో బర్నబాలుండే వారు. ఈ బర్నబా ఎవరో తెలుసా, అతడు తనకున్న భూమిని అమ్మి దానిని సంఘానికి ఇచ్చిన వ్యక్తి (అ.కా. 4:37). అతని పేరుకు అర్థం హెచ్చరిక పుత్రుడు. అనేక మందిని ప్రోత్సహించిన వ్యక్తి. పౌలును బర్నబా చేరదీయకపోతే చరిత్ర ఇంకే విధంగా ఉండేదో ! పరిచర్యకు పనికి రాడు, అతడు మనకొద్దు అని, పౌలు, మార్కును తనతో తీసుకెళ్ళడానికి నిరాకరిస్తే, బర్నబా అతనిని చేరదీసి బలపరిచాడు. అందుకే మళ్ళీ, మార్కును పౌలు అంగీకరించాడు. సంఘాలలో నేడు అలాంటి వ్యక్తులుంటే ఆది సంఘం వలె ఆ సంఘాలు కూడా తమ చుట్టు ఉన్న వారిని క్రైస్తవులుగా ఎప్పుడో చేసి ఉండేవారు. బర్నబా తన భూమిని అమ్మి సంఘానికిస్తే, నేడు సంఘపు ఆస్తులను అమ్మి దోచుకొనే వారిని గురించి మనం వినడం లేదా? ఎటువంటి ప్రభావాన్ని మన సంఘాలు, నేటి సమాజంపై కలుగజేస్తున్నాయి?

ఆ రోజులలో శిష్యులను చూచి, వారి జీవిత విధానం చూచి, బుల్లి మెస్సీయాలు అనే అర్థం కలిగిన "క్రిష్టియనాస్" అనే పేరుతో వారిని పిలుస్తూ హేళన చేసేవారు, రోమా సైనికులు. ఆ గ్రీకు పదం తర్జుమాయే "క్రైస్తవుడు".

క్రైస్తవులని పిలువబడిన క్రీస్తు శిష్యులు జీవిత విధానం తమ చుట్టు ఉన్నవారికి గొప్ప ఆశ్చర్యం కలిగించేది. ఎటువంటి హంగామా లేనివారి జీవనశైలి, విశాల స్నేహభావం, అనేకమందిని ఆకర్షించేది. డబ్బు సంపాదించడం వారి వారి ప్రాథమిక జీవిత లక్ష్యం కాదు. వారు ఎప్పుడు చేసేదేమంటే దేవుని స్తుతించడం, మనుష్యులలో మార్పును తేగల సందేశాన్ని ఇతరులకు అందించడం. ఈ విధంగా క్రైస్తవ్యం నలుమూలలా విస్తరించింది. నేటి సంఘాలు సభ్యుల సంతానాభివృద్ధి వలన సంఖ్య పెరుగుతున్నది తప్ప సువార్తను ఇతరులకు చెప్పడం ద్వారా కాదు. చాలమంది ఈ పని చేయడం లేదెందుకంటే, వారి జీవితాలను ఇంకా యేసుకివ్వలేదు. యేసు ఆత్మ నివసించే దేవాలయాలుగా ఉండవలసిన మనం, అనేక దయ్యాలు నివసించే దయ్యాలకొంపగా ఉంటున్నామా? మనలోని దయ్యాలను వెళ్ళగొట్టడానికే యేసు ప్రభువు మరియొకసారి మన దగ్గరకు వచ్చాడీ రోజు. అదే నేటి సువార్త పాఠం.

## సువార్త పాఠం: మార్కు 5:1-20; సర్వశక్తుడైన దేవుని సాక్షులం మనం

మనలో దేవుని ఆత్మ నివసించక పోతే, ఇంకెవరు నివసిస్తారు? దయ్యాలు, ఒక దయ్యం వెళ్ళి ఇంకొక దాని తీసుకువస్తుంది. అలాంటి అనేక దయ్యాలున్న వ్యక్తిని, గెరాసేనుల దేశములో బాగుచేసిన యేసు, ఈ రోజు మనలో ఉన్న సాతానును వెళ్ళగొట్టడానికి మన దగ్గరకు వచ్చాడు. యేసును కలిగి లేని వ్యక్తి చావు ఏలు సమాధులలోనివసిస్తాడు. అనేక విధాలుగా తనను తాను గాయపరచుకుంటుంటాడు. ఎవ్వరికి లోబడడు. ఆధ్యాత్మికంగా నేడు చాలమంది ఆ స్థితిలోనే ఉన్నారు. కనికరము గల యేసు ఆ స్థితిలో నుండి మనలను బాగు చేయడానికి ఈ రోజు వచ్చాడు. సాతాను మనలను, తన ఆధీనంలో ఉంచుకోవడానికి నిత్యం ప్రయత్నిస్తుంటాడు. అయితే యేసు మనలను బాగు చేయాలని నిత్యం ప్రయత్నిస్తుంటాడు. మార్కు తన సువార్తలో సాతాను, మరియు యేసుల మధ్య జరిగిన సంఘర్షణను అనేకసార్లు చూపించాడు. ఆయన సాతానును అప్పటికప్పుడే నిత్య నరకంలోకి పంపించగలడు. అయితే కరుణ గల దేవుడు సాతానుకు కూడా సమయం ఇస్తున్నాడు. అందుకే సాతాను కోరిక మేరకు మన్నించి పందులలోనికి వెళ్ళడానికి అనుమతినిచ్చాడు.

ఈ సంఘటన ద్వారా మనం నేర్చుకోవలసిన ఆధ్యాత్మిక పాఠాలేవనగా యేసు ప్రభువు సర్వశక్తిమంతుడు. సాతానును అదుపు చేయగల దేవుడు. ఆయన నేడు మనలను తన శక్తిని గుర్తించ మంటున్నాడు. సాతాను బంధకాల నుండి విడుదల కమ్మంటున్నాడు. నేడే యేసును స్వీకరించి ఆయన ఆలయం కమ్మంటున్నాడు. అద్భుతాన్ని చవిచూడమంటున్నాడు. వెళ్ళి ఆయన శక్తిని మొదట మనవాళ్ళకు తెలియజేయమంటున్నాడు.

కనుక సమాజంలో మార్పు రావాలంటే సమాజంలో ప్రతి ఒక్కరు ముందు మారాలి. అంటే తమను మార్చగల యేసును వారంగీకరించాలి. అలా అంగీకరించి రక్షింపబడిన ప్రతివారు మొదట వెళ్ళి తన కుటుంబ సభ్యులకు తన పట్ల దేవుడు చేసిన కార్యాలను పంచుకోవాలి. ఆ తరువాత మన స్నేహితులతో, అందరితో యేసును పంచుకోవాలి. సేన దయ్యము గల వ్యక్తి, యేసును అంగీకరించాక, మొత్తం దెకపొలి ప్రాంతం అంతటిలో ప్రకటింప ఆరంభించాడు. అందరిని యేసు సువార్తతో ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఒకవ్యక్తి ఎంత పని చేయగలిగాడో చూశారా? నేడు దేవుడు మనను కూడా అదే చేయమంటున్నాడు. మరి మనం ఏం చేయాలి. మొదట మనం యేసును అంగీకరించుట ద్వారా ఆయన ఆలయం అవ్వాలి. ఆయన శక్తి అనుభవించాలి. వెళ్ళి మన జీవితాలలో ఆయన చేసిన కార్యాలను చాటించాలి. ఆ పని మొదట మన కుటుంబంలో చేయాలి. మీరు రక్షణ పొందేరని ఇంతవరకు ఎవరికైనా చెప్పారా? ఎందుకు చెప్పలేకపోతున్నాం ఆలోచించమంటున్నాడు? ఈ రోజు ఆయనతో కలిసి సమాజం మరియు మొత్తం విశ్వమంతటిని ప్రభావితం చేయడానికి ఆయనను వెంబడించమంటున్నాడు. మరి మీరేమంటారు.





**జీవితానికి అన్వయం –** మనం క్రీస్తు స్వరూపంలోనికి మార్చబడుతున్నపుడు, మనలోని క్రీస్తును అందరు చూడగలరు. ఈ విధంగా సమాజాన్ని ప్రభావితం చేయమంటున్నాడు దేవుడు. నేడే మీ హృదయంలోనికి యేసును రమ్మనండి. ఆయన వాక్యంలో ఆయన మహిమను చూడండి. అప్పుడు దేవుని ఆత్మ మిమ్మును ఆయన స్వరూపంలోనికి మారుస్తుంది (2 కొరింథీ 5:18).

**అనుదిన ధ్యాన సూచనలు.**

**సోమవారం :** లూకా 4:16-21 ధ్యానించండి. యేసు ప్రభువును దేవుడు ఎందుకు ఈ లోకానికి పంపించాడో క్రీస్తు మనలను అందుకే లోకంలోనికి పంపించాడు. మనం చేయవలసిన పరిచర్య ఏమిటి? ఈ పరిచర్య మనం సంఘాలలో చేస్తున్నామా? ఎందుకు చేయట్లేదు? ఎవరు కారణం? ఆలోచించండి.

**మంగళవారం :** మత్తయి 25:31-46 ధ్యానించండి. దేనిని బట్టి అంత్య దినములలో ప్రభువు మనలను తీర్పు తీరుస్తాడు. ఆయన రాజ్యంను స్వతంత్రించుకొనుటకు మనం ఈ లోకంలో ఏమి చేయాలి?

**బుధవారం :** గలతీ 6:1-10 ధ్యానించండి. క్రీస్తు నియమమును మనం ఎలా పూర్తిగా నెరవేర్చగలము?

**గురువారం :** 2 సమూ. 9:1-13 ధ్యానించండి. కుంటి మెఫీబోషేతును దావీదు ఎలా పరామర్శించాడు. నేడు వికలాంగులుగా ఉన్న మనవాళ్ళ పట్ల మనం ఎటువంటి శ్రద్ధ చూపగలం.

**శుక్రవారం :** 1 థెస్సలోనిక 5:12-22 ధ్యానించండి. ఈ వాక్యంలో దేవుడు మనలను యేసును ఏమి చేయమంటున్నాడో వ్రాయండి.

**శనివారం :** మత్తయి 11:1-6 ధ్యానించండి. యోహానుకు యేసు ప్రభువును గూర్చి ఎందుకు సందేహం వచ్చి ఉండవచ్చు. మన సంఘం రోగుల పట్ల ఎంత శ్రద్ధ కలిగి ఉంది. మనం ఏమి చేయగలమో ఆలోచించండి.

**12-10-08**

## మానసిక మరియు శారీరక సవాళ్లను ఎదుర్కొనువారికి మన మద్దతు

**(2 సమూ. 9:1-13, కీర్త. 38, 1 థెస్స 5:12-22, మత్త 11:1-6)**

**స్తుతి ఆరాధన : కీర్తన 38**

పాపంలో ఆనందమున్నదన్న సత్యాన్ని ఎవరూ కాదనరు. లేకపోతే అందరూ ఎందుకు

పాపం చేస్తారు? కాని మనం ఏది విత్తుతామో దానినే కోస్తాం. విత్తేటప్పుడు బాగానే ఉంటుంది. కోసేటప్పుడు బాధ పడక తప్పదు. అందుకే దావీదు అంత స్పష్టంగా ఆ బాధను చిత్రించాడు ఈ కీర్తనలో. ఈ కీర్తన మన పాప పర్యవసానం ఎలా ఉంటుందో, బాణములతో గుచ్చబడుట, దేవుని భారమైన హస్తము క్రింద నలుగుట. ఆరోగ్యము లేకపోవుట, మునిగిపోవుట, విశ్రాంతి లేకపోవుట అను పదాలు మనకు చూపిస్తాయి.

మనం పాపం చేయకూడదు. చేస్తే ఒప్పుకోవడం వాయిదా వేస్తూ రాకూడదు. తాను చేసిన పాప పర్యవసానాన్ని దావీదు ఇప్పుడు అనుభవిస్తున్నాడు. పాపపు విత్తనాలు విత్తాడు. భయంకరమైన పంట కోసాడు. అయితే ఆ పాప విషయంలో ఏమి చేయకుండా ఉండలేదు. తన పాపములనొప్పుకున్నాడు. మనం కూడా మన పాపాలను మనం ఒప్పుకుంటే దేవుడు తప్పక మనలను క్షమిస్తాడు. నిజమే మనం ఏది విత్తితే దానిని కోయలాగున దేవుడు చేస్తాడు. అయితే ఆయన కృపను బట్టి మనను క్షమిస్తాడు. శుద్ధునిగా చేస్తాడు.

## సందేశము

శిష్యులు ఒకసారి ఒక పుట్టు గ్రుడ్డివాని చూపించి, ఎవరు పాపం చేయడం వలన వీడు గ్రుడ్డివాడుగా పుట్టాడు అని యేసు ప్రభువును అడిగారు. అయితే, యేసు, ఎవరో పాపం చేయడం వలన వాడు గ్రుడ్డివాడుగా పుట్టలేదు. దేవుని క్రియలు వీనియందు ప్రత్యక్షపరచబడదాని వీడు గ్రుడ్డివాడుగా పుట్టాడు అని తెలియజేసారు (యోహా. 9:1-4). కనుక దేవుడు సమస్తాన్ని తన మహిమ కొరకు సృజించాడు, అని నేడు మనం గుర్తించాలి. అయితే కొంతమందిని సాతానుగాడు అవిటి వారినిగా చేస్తాడు. లూకా 13:11లో ఒక స్త్రీ నడుము వంగిపోయి ఉండడానికి కారణం ఆమెలో ఉన్న దయ్యం అని లూకా తెలియజేసాడు. అయితే, ఎవరూ ఆమెను చూడకపోయినా యేసు ఆమెను చూచాడు. ఆమెను స్వస్థపరచాడు. ఆమె చక్కగా నిలువబడి దేవుని మహిమపరచింది. కనుక మన చుట్టు ఉన్న కుంటివారు, గ్రుడ్డివారు, కుష్టురోగులు, చెవిటివారు ఏ కారణం వలన అలా అయ్యారో అని ఆలోచించే కంటే వారి జీవితాలను మెరుగుపరచడానికి మనం చేయగలిగినంత చేయగలిగితే వారు మనలో దేవుని చూడగలుగుతారు. ఈ లోకంలో దేవుడు అందరికి వాగ్దానం చేసిన సమృద్ధి జీవితాన్ని అనుభవించగలరు. అదే నేటి సువార్త పాఠం. నేడు మానసికంగా శారీరకంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న వారిపట్ల కూడా దేవుని కృప ఉన్నదని మనం పాతనిబంధన పాఠంలో చూస్తాం. అయితే ఆ కృప మహదైశ్వర్యాన్ని దేవుడు క్రీస్తు ద్వారా అందరికి ఇవ్వాలనుకుంటున్నాడు. దేవునికి మానవాళి రక్షణ ప్రణాళిక అమలు చేయడానికి ఈ లోకంలో ఒక శరీరం కావలసి వచ్చింది. క్రీస్తు శరీరధారిగా ఈ లోకంలోనికి వచ్చి, మానవులను





అవిటివాళ్ళుగా చేయుచున్న సాతానును సిలువ సంగ్రామంలో ఓడించాడు. ఆయన ఈ లోకంలో ఉన్నప్పుడు, ఆయన శరీరం, శరీరం నంబర్ వన్. ఆయన పరమునకు చేర్చుకోబడిన తరువాత ఆయన మొదలు పెట్టిన దానిని ముగించడానికి, ఆయనకు ఇంకో శరీరం కావాల్సి వచ్చింది. అది శరీరం నంబర్ టు. అదే సంఘం. మొదటి శరీరాన్ని దాల్చి ఈ లోకానికి వచ్చినపుడు, దేవుడు ఆయనను చేయమని అభిషేకించిన పరిచర్య, బీదలకు సువార్త ప్రకటించుట, చెరలోనున్న వారిని విడిపించుట, గ్రుడ్డివారికి చూపు కలుగునని ప్రకటించుట, నలిగిన వారిని విడిపించుట, ప్రభువు హితవత్సరమును ప్రకటించుట. ఈ పరిచర్య కొరకు దేవుడు నన్ను అభిషేకించాడు అని యేసు తెలియజేసాడు లూకా (4:18-19). దానిని ఆయన నెరవేర్చాడు కూడాను. ఇప్పుడు ఆ పని ముగించడానికి ఆయన దాల్చిన శరీరం సంఘం.

నేడు మనం మానసిక శరీర, సవాళ్లను ఎదుర్కొంటున్న మన సహోదర, సహోదరీలకు ఏ విధంగా సహాయం చేయగమో ఆలోచించే ఆదివారం. థెస్సలోనికా సంఘమునకు, బలహీనులకు ఊతమియ్యమని పౌలు ద్వారా హెచ్చరించిన దేవుడు మరియొకసారి ఆ పనిని మనలను చేయమంటున్నాడీ రోజు. అదే నేటి ముఖ్య ధ్యానాంశం.

### సువార్త పాఠం: మత్త 11:1-6; యేసు హృదయంలో వీరికి ప్రత్యేక స్థానముంది

ఒక్కొక్కసారి కష్టాలు వారిని చుట్టుముట్టినపుడు, దేవుని సేవకులకు, దేవుడు వారికిచ్చిన ప్రత్యక్షతలను గూర్చిన సంశయాలు వారిని చుట్టుముడుతుంటాయి. అదే జరిగింది. బాప్తిస్మమిచ్చు యోహాను విషయంలో. పరిశుద్ధాత్మ ద్వారా ఎవరి రాక కొరకు మార్గము సరాళము చేయుటకు దేవుడు తనను పంపేడో, ఆయన తన దగ్గరకు బాప్తిస్మం తీసుకోవడానికి వచ్చిన యేసు అని యోహాను గుర్తించాడు. ఆయనను ప్రజలందరికి లోకపాపములు మోసుకొని పోవు దేవుని గొఱ్ఱెపిల్లగా పరిచయం చేసాడు. తాను ఆయన చెప్పుల వారును విప్పుటకు కూడా తగనని మరియు ఆయన పెండ్లి కుమారుడైన యేసు స్నేహితుడు మాత్రమే అని ప్రజలందరికి అతి వినయంగా తనను తాను తగ్గించుకుంటూ చెప్పాడు. యేసే దేవుని కుమారుడు అన్న ప్రత్యక్షతను దేవుని దగ్గర నుండి పొందాడు. అంత గొప్ప సేవకుడైన యోహాను తాను చెరసాలలో వేయబడిన తరువాత, యేసును గూర్చిన సంశయాలు ఆయనకు వచ్చాయి. ఈయన నిజంగా దేవుని కుమారుడేనా? అయితే నాకెందుకీ కష్టాలు? అన్న ఆలోచనలు యోహానుకు కలిగి ఉంటాయి. అందుకే తనను పరామర్శించడానికి వచ్చిన శిష్యులను సందేహ నివృత్తి కొరకు యేసు దగ్గరకు పంపాడు. అప్పుడు, యేసు మీరు కనిపెట్టుచున్న మెస్సీయా నేనేనయ్యా నన్ను గురించి అభ్యంతర పడవద్దు. ఇదిగో జరుగుచున్న

విషయాలను చూడు. గ్రుడ్డివారు చూపు పొందుచున్నారు. కుంటివారు నడచుచున్నారు, కుష్ఠురోగులు శుద్ధులగుచున్నారు. చెవిటివారు వినుచున్నారు. చనిపోయినవారు లేపబడుచున్నారు. బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది అని యోహాను సందేహాలను తీర్చాడు.

ఈ విధంగా లోకానికి పరిచర్య చేయుటకు మరియు వారి కొరకు ప్రాణమిచ్చుటకు వచ్చినవాడు మనం ఆరాధించు యేసు ప్రభువు (మార్కు 10:41). కనుక సంఘమంటే పరిచర్య చేసే దేవుని సేవకుడు. సంఘమను క్రీస్తు శరీరంలో బాప్తిస్మం ద్వారా ప్రవేశించిన వారందరి బాధ్యత ఇది. క్రీస్తు శిష్యులు పరిచర్య చేసేవారు. అంటే క్రీస్తు ప్రేమను లోకానికి చూపించేవారు. ఈ రోజు పాత నిబంధనలో దావీదు మెఫీబోషెతుకు చూపించిన విధంగా చూపించమని పాతనిబంధన పాఠం ద్వారా దేవుడు మనతో మాట్లాడుతున్నాడు.

**పాత నిబంధన పాఠం: 2 సమూ. 9:1-13; వారిపట్ల దేవునికున్న కృప విస్తారం**

దావీదు తన స్నేహితుని పట్ల గల ప్రేమను బట్టి, కుంటివాడైన యోనాతాను కుమారుడైన మెఫీబోషెతు పట్ల ఎంతో జాలి, కరుణతో, సౌలు అతని కుటుంబమునకు చెందిన యావదాస్తిని అతనికిచ్చి, అతడు నిత్యము దావీదుతోనే భోజనము చేసే ఏర్పాటు చేసాడు. భూములను సాగుచేసే పని సీబాకు అప్పజెప్పాడు. పాపము చేసి అవిటివాడైన మానవుని పట్ల దేవునికున్న అపార ప్రేమకు ఇది ఒక దృష్టాంతం. ప్రతి విశ్వాసి క్రీస్తునందు విశ్వాసము వలన ఆధ్యాత్మికంగా దావీదు సంతానమే. కనుక నేడు దావీదు మెఫీబోషెతుకి ఏ విధంగా కరుణ చూపించాడో మనం కూడా మన సహోదరులలో అంగవైకల్యముగ వారి పట్ల జాలి కరుణతో వారికి ఊతమియ్యుటకు ఆలోచనలు చేయమంటున్నాడు దేవుడు నేటి పత్రిక పాఠం ద్వారా!

**పత్రిక పాఠం: 1 థెస్స 5:12-22; చేయూతనిచ్చే బాధ్యత సంఘందే**

బైబిలులో థెస్సలోనికా సంఘం మంచి పేరున్న సంఘం. పౌలు యొక్క రెండవ సువార్త ప్రయాణంలో ఈ సంఘం పుట్టింది. విశ్వాసంతో పనిచేసారని, ప్రేమతో ప్రయాసపడ్డారని, నిరీక్షణతో కూడిన ఓర్పును సహనాన్ని కలిగి ఉన్నారని, పౌలు ఎప్పుడు ఈ సంఘం గురించి దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించేవాడు (1 థెస్స 1:2,3). అంతమాత్రమే కాదు, వీరు చాల పేదలైనప్పటికి, ప్రభువు ప్రేమను బట్టి ధారాళంగా దేనికైనా ఇచ్చేవారు. లేతప్రాయంలో ఉన్న ఈ సంఘానికి ప్రభువు రెండవ రాకడను గూర్చి ఉన్న కొన్ని అపోహలను తీసివేయుటకు తమ ప్రియులను పోగొట్టుకున్నవారిని ఓదార్చుటకు పౌలు ఈ పత్రిక వ్రాసాడు.





1. మెలకువగా ఉండమని (5-6) 2. పెద్దలను గౌరవించమని (5:12,13) 3. బలహీనుల అవసరాలను దృష్టిలో ఉంచుకోమని (13:14), 4.ఎల్లప్పుడు సంతోషంగా ఉండమని (5:15) 5. ఎడతెగక ప్రార్థన చేయమని (5:16), 6. మేలైన దానిని చేయుటకు నమ్మకంగా ఉండమని (5:21), 7. ప్రతివిధమైన కీడుకు దూరంగా ఉండమని (5:22), 8. ప్రతి విషయంలో దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించమని (5:10), 9. పరిశుద్ధాత్మను ఆర్పవద్దని (17), 10. ప్రవచించుట నిర్లక్ష్యం చేయవద్దని (21) పౌలు ద్వారా థెస్సలోనికా సంఘాన్ని హెచ్చరించిన దేవుడు ఈ రోజు మనలను కూడా హెచ్చరిస్తున్నాడు.

ఈ రోజు ప్రత్యేకంగా మానసికంగాని, శారీరకంగాను బలహీనులైన వారికి చేయుతనివ్వడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనలను ఆలోచించమంటున్నాడు. మాటలు రాని వారికి, చెవిటివారికి, గ్రుడ్డివారికి, అంగవైకల్యం గలవారికి వారి కాళ్ళ మీద వారు నిలువబడడానికి, మన చుట్టూ అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రారంభించబడినవి. ఆలాంటి సంస్థలను, మనం కూడా ఎందుకు ప్రారంభించకూడదు? కొన్ని సంఘాలు వారి చందాలను fixed deposit లో వేసి అతిశయిస్తుంటారు. మేలైనది చేయనెరిగియు, అలాగు చేయకపోతే అది పాపం చేయడమే అంటాడు యాకోబు (యాకో. 4:17).

పరిశుద్ధాత్మ దేవుడు సమస్తము పరీక్షించి మేలైన దానిని చేపట్టమంటున్నాడు. కనుక మన చుట్టు ఉన్న అనేక శరీరక, మానసిక బలహీనులకు, ఊతమీయుటకు ఏమి చేయగలమో అది చేయుటకు మరియు ఇప్పుడు కొంతమంది ప్రారంభించిన 1. Mission to Blind 2. మనోసేవ లాంటి సంస్థలను ప్రారంభించుటకు, దేవుడు వికలాంగులకిచ్చిన గొప్ప తలాంతులను దేవుని మహిమార్థమై పెంపొందించుకొని వాడుటకు, వారికి ఇవ్వగలిగిన ప్రోత్సాహం ఇచ్చుటకు పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం చేయును గాక !

**జీవితానికి అన్వయం –** మానసిక, శారీరక సవాళ్లు ఉన్న విశ్వాసులు కొంతమంది బాగా పాడగలరు, వాయిద్యాలు వాయించగలరు. ఈ విధంగా దేవుడు వారికిచ్చన తలాంతులను గుర్తించి, వాటిని వారు పెంపొందించుకొని దేవుని మహిమార్థమై వాడుటకు దాని ద్వారా వారికి జీవనోపాధిని కూడా కల్పించుటకు సంఘం కొన్ని పథకాలను చేపట్టవచ్చు. వారి తలాంతులను ప్రదర్శించగలుగుటకు, సంగీత కచేరీలను సంఘం ఏర్పాటు చేయుట ద్వారా ఈ రోజు వారిని ప్రోత్సహించవచ్చు. ఆర్థికంగా వారికి సహాయమందించవచ్చు.

**అనుదిన ధ్యాన సూచనలు.**

**సోమవారం :** మత్తయి 6:19-34 ధ్యానించండి. దేని గురించి మనం ఎక్కువ కష్టపడాలి?

మొదట మనం చేయవలసింది ఏమిటి? అది చేస్తే మనకు దేవుడు ఏమి వాగ్దానం చేస్తున్నాడు? (33వ).

**మంగళవారం :** యాకోబు 1:19-27 ధ్యానించండి. యథార్థమైన భక్తి ఏమిటి? ఎఫెసీ 4:17-24 ధ్యానించండి.

**బుధవారం :** యోహాను 6:60-71 ధ్యానించండి. ఏది ముఖ్యం? ఆత్మ? లేక శరీరమా? మరి మనం దేనిగురించి ఎక్కువ ఆలోచిస్తుంటాము? ఆత్మ గురించి ఆలోచించడానికి ప్రయత్నం చేయండి. మీరు తిరిగి జన్మించారా?

**గురువారం :** 1 సమూ. 17:32-50 ధ్యానించండి. బాలుడైన దావీదుకు అంత ధైర్యం ఎక్కడి నుండి వచ్చింది? దానియేలు 11:31 చదవండి. మీరుదేవుని కొరకు గొప్ప కార్యాలు చేయగలుగుతున్నారా?

**శుక్రవారం :** ఫిలిప్పి 3:1-16 ధ్యానించండి. జీవితంలో అతి శ్రేష్ఠమైనది ఏది? దానిని సంపాదించడానికి మనం ఏమి చేయాలి?

**శనివారం :** మార్కు 10:17-31 ధ్యానించండి. ధనవంతునికి కొదువగా ఉన్నది ఏమిటి? అది మనకు కూడా కొదువుగా ఉందేమో?

**19-10-08**

## సాంకేతిక యుగంలో ఆధ్యాత్మికత

### (1 సమూ. 17:32-50, కీర్త 111, ఫి. 3:1-16, మార్కు 10:17-31)

### స్తుతి ఆరాధన : కీర్తన 111

చాలా జ్ఞానం గల లోకంలో ఇప్పుడు మనం జీవిస్తున్నాము. అయితే ఈ లోకంలో వివేకం అంత కనిపించదు. జ్ఞానులని చలామణి అయ్యేవారు చాలా తెలివితక్కువ పనులను చేయడం మనం చూస్తుంటాం. దావీదు ఈ కీర్తనలో వాస్తవమైన జ్ఞాన వివేకముల యొక్క రహస్యాన్ని తెలియజేస్తున్నాడు. యెహోవా యందలి భయము జ్ఞానమునకు మూలం. ఆయన శాసనములు గైకొనువారందరు మంచి వివేకము గలవారు (10వ) అని తెలియజేయుచున్నాడు. మూడు రహస్యాలు ఇందులో ఉన్నాయి.

1. **దేవుని యందలి భయము :** ఇది కోపంగా ఉన్న యజమానుడు అంటే ఒక బానిసకు గల భయం లాంటిది కాదు. ప్రేమ గల తండ్రి పట్ల ప్రేమ గల బిడ్డకు గల గౌరవ ప్రేమాభిమానం. అంటే ఆయన పట్ల, ఆయన సన్నిధి పట్ల, ఆయన వాక్యం పట్ల మరియు ఆయన చిత్తం పట్ల గల భక్తి శ్రద్ధలు.





2. **దేవునికి విధేయత :** చదవడానికి మరియు అధ్యయనం చేయడానికే దేవుని వాక్యం మనకు ఇవ్వబడలేదు. మనం వాక్య ప్రకారంగా నడచుకొనే వారిగా ఉండాలి. వాక్యానికి విధేయత చూపించడం మనం మొదలు పెట్టినప్పుడు దానిని అర్థం చేసుకోవడం ప్రారంభమవుతుంది. ఆయన శాసనములు గైకొనువారందరు మంచి వివేకం గలవారు.

3. **దేవుని కొనియాడడం :** ఆయనకు నిత్యం స్తోత్రం కలుగును గాక ! ఆయనను మనం స్తుతించినప్పుడు మనలోని స్వార్థం మాయమవుతుంది. అది మనను విగ్రహారాధనకు దూరం చేస్తుంది. మనమిక ప్రతిక్షేపాల మీద ఆధారపడి జీవించడం మానేస్తాం.

కనుక యెహోవాయందలి భయభక్తులతో ఆయనను ఆరాధిద్దాం.

### సందేశము

దేవుడు మానవులను తన ఆత్మ స్వరూపంలో చేసి వారు ఈ లోకంలో ఏం చేయాలో గూడా వారికి తెలియజేసాడు. సర్వము ఆయనయందు సృజింపబడెను. సర్వము ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను (కొల. 1:16). మానవకోటి ఫుల్ టైమ్ డ్యూటి దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన కట్టడలను అనుసరించి నడచుటయే (ప్రసంగి 12:13). ఆధ్యాత్మికత అనగా, జీవింపజేయు ఆత్మానుసారంగా జీవించడం. శరీరము కేవలము నిష్ప్రయోజనం (యోహా 6:63). దేవుడు తన సృష్టిపై గృహ నిర్వాహకులుగా ఉండమని మనలను నియమించాడు. అందు నిమిత్తము సమస్తాన్ని మనకు అందుబాటులో ఉంచాడు. ఏది కావాలంటే, దానిని గూర్చి ఆయనను అడిగి పొందమన్నాడు. అయితే మానవులు దేవుడిచ్చిన మెదడుతోనే అన్ని ఆలోచనలు చేస్తూ, ఎన్నింటినో కనుగొంటూ, చివరకు దేవుడు లేడంటున్నారు. జగదుత్పత్తి మొదలు సృష్టించబడిన వస్తువులు ఆయన అదృశ్య లక్షణములను అనగా ఆయన నిత్యశక్తిని, దేవత్వాన్ని తేటతెల్లము చేయుచున్నప్పటికి తాము అత్యంత విజ్ఞానులమనుకొను శాస్త్రవేత్తలు దేవుడు లేడంటున్నారు. బైబిలు దానిని బుద్ధి హీనత అంటుంది (రోమా 1:19,20 కీర్త 53:1).

నిజమే, నేడు మానవులు, శాస్త్రీయంగాను, సాంకేతికపరంగాను రోజురోజుకు ఉన్నత శిఖరాలను అధిగమిస్తున్నారు. నేడు మనం అత్యాధునిక, అత్యంత వేగంగా పురోభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగంలో ఉన్నాం. నేడు మానవులు ఎంత ముందుకు వెళ్తున్నారంటే దేవునిని వెనక విడిచిపెట్టే అంత ముందుకు వెళ్తున్నారు. నేడు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒక విగ్రహంగా పూజిస్తున్నారు మానవులు. విగ్రహారాధన అంటే సృష్టికర్తపై నమ్మకముంచకుండా, ఒక రకమైన సృష్టముపై నమ్మకముంచడం. అత్యాధునిక సాంకేతిక విజ్ఞానం మన భద్రతకు

మూలమైంది. అదే మనలను రక్షిస్తుంది అనుకుంటున్నాం నేడు. మన సమస్యలన్నిటిని మన శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం పరిష్కరిస్తుందనుకోవడం అత్యంత బుద్ధి హీనత. ఒక్కొక్కసారి సాంకేతికపరిజ్ఞానం మానవుల పట్ల శాపంగా మారుతుంది. ఉదాహరణకు జన్యు మార్పిడి పంటలు, మానవాళి ఆరోగ్యానికి తీవ్ర ముప్పు తీసుకొని వస్తూ ఉన్నాయి. నేడు కొన్ని దేశాల దగ్గర ఉన్న మారణ అణు ఆయుధాలు ప్రపంచాన్ని కొన్ని క్షణాలలో అంతమొందించేవిగా ఉన్నాయి. వాతావరణం రోజు రోజుకు కలుషితం అవడానికి నేటి సాంకేతిక పురోభివృద్ధియే మూలకారణం. రాను రాను లోకంలో, సత్యం, కనికరం, దేవుని గూర్చిన జ్ఞానం కరువైపోవడం వలన లోకవాసులు క్షీణించి పోతున్నారు (హోషే. 4:1-3).

ఒక్కొక్కసారి మానవులను సవాలు చేస్తున్న గొల్యాతులను నాశనం చేయడానికి నేటి పాత నిబంధన పాఠంలోని, దేవునియందు దావీదుకు గల, చిన్నపిల్లవాని వంటి అచంచల విశ్వాసం కావాలి. నేటి సువార్త పాఠంలోని యవ్వనస్తుడు, డబ్బే సర్వస్వమనుకొనినట్లు మనం దినదినం సంపాదిస్తున్న సాంకేతిక పరిజ్ఞానమే సర్వస్వం అనుకోవడం, నేటి మానవులకున్న ఏకైక లోటు. మనకన్నీ ఉండవచ్చు అయితే దేవునితో నడవడానికి మనం ఇష్టపడకపోతే, అది మనలను నాశనానికే నడిపిస్తుంది. ఇట్టి పరిస్థితులలో మనం **పెంపొందించుకోవలసిన ఆధ్యాత్మికత ఏమంటే, క్రీస్తును సంపాదించుకొని, దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందునట్లుగా ఈ లోకంలో పౌలు వలే జీవించుటయే.** అదే నేటి పత్రిక పాఠం.

**పాత నిబంధన పాఠం: 1 సమూ. 17:32-50; ఆధ్యాత్మికత అనగా దేవునిపై ఆధారపడడం**

ఈ కథ మనందరికి సుపరిచితమైనదే. చిన్నప్పటి నుంచి, గుమా గుమాకే మరా ! గుమా గుమాకే మరా ! దావీదునే గొల్యాతుకో డోపన్‌సే మారా! అనే పాట మన పిల్లలు సండేస్కూలులో పాడడం విన్నాం. ఇప్పుడు మా మనవడు జెర్మీ ఆ పాట పాడుతుంటే మా హృదయాలు ఉప్పొంగిపోతాయి. బాల్యదినములందే దావీదు మన సృష్టికర్తయైన సైన్యములకధిపతియైన యెహోవాను మరియు ఆయన శక్తిని తెలుసుకున్నాడు.

నేడు మన పిల్లలకు కంప్యూటర్ ఎలా వాడాలో నేర్పే మనం, వారికి త్రియేక దేవుని గూర్చి నేర్పుతున్నామా? అది ముఖ్యం. మన పిల్లలను బాల్య దినములనుండి దావీదు లాంటి ఆధ్యాత్మిక శూరులుగా చేయడానికి నేడు మన సంఘాలు అన్ని విధాలుగా ఆలోచించాలి. అప్పుడు వారు వారి జీవితాలలో ఎదుర్కొను ఎటువంటి గొల్యాతులనైనా ఓడిస్తారు. బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పవలసిన బాధ్యత మొదటగా తల్లిదండ్రులదే (సామె.





22:6). నేడు మన పిల్లలు చిన్నప్పటి నుండి టి.వి. ఎక్కువ చూడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. దేవునిపై ఆధారపడడం నేర్పించకుండా, వారికి వారు ఏదీ అడిగితే అది కొనిస్తే, జీవితంలో డబ్బుతో ఏదైన సంపాదించగలం అన్న వైఖరిని పెంపొందించుకుంటారు, నేటిసువార్త పాఠంలోని యవ్వనస్తుడివలే. అందుకే మన పిల్లలకు బాల్య దినములందే వారికి సృష్టికర్తను తెలియ జేయాల్సిన బాధ్యత ప్రతి తల్లి తండ్రిదే.

**సువార్త పాఠం: మార్కు 10:17-31; ఆధ్యాత్మికత అనగా యేసును వెంబడించుట**

ఒక విధంగా ఆధ్యాత్మికత అంటే, జీవన విధానమే ! ప్రత్యేకమైన జీవన సందర్భాలలో, ఒకరి విశ్వాసమును ప్రదర్శించుట అందులో ఒక భాగమే. కనుక వివిధ మతాలకు చెందినవారు, వివిధ రకాలైన ఆధ్యాత్మిక జీవన విధానాన్ని కలిగి ఉంటారు. క్రైస్తవ ఆధ్యాత్మిక జీవన విధానం అంటే, ఆదివారం గుడికి వెళ్ళడం, ప్రార్థన చేయడం, చందాలివ్వడం, పది ఆజ్ఞలను పాటించడం, ఇదే అని ఈ రోజు వాక్యభాగంలో ఉన్న యవ్వనస్థుని వలే మనం అనుకుంటాం. కాని ఇది కాదని ఈ రోజు యేసు ప్రభువు మనకు తెలియజేస్తున్నాడు. క్రైస్తవ ఆధ్యాత్మికత మొదట, తిరిగి జన్మించడంతో మొదలవుతుంది. తరువాత, యేసును వెంబడించడంతో కొనసాగుతుంది. క్రీస్తు స్వరూపంలోనికి రూపాంతరం చెందుతూ పరలోకం చేరడం దీని గమ్యం.

నేడు మనకు అత్యంత ఆధునిక వనరులను దేవుడు మనకిచ్చాడు. ఎంతో సుఖానికి, సౌఖ్యానికి అలవాటు పడ్డాం. కారులో ఆదివారం గుడికి వెళ్ళి వచ్చేస్తే చాలు, అంతకంటే మరి దేనిని గురించి ఆలోచించడానికి సమయం లేదంటున్నాం. కాని దేవుడు అనుదినం ఆయనను వెంబడిస్తూ శిష్యులుగా ఈ లోకంలో జీవించే, ఆధ్యాత్మికతను మనలో కోరుతున్నాడు. క్రైస్తవ్యం మతం కాదు. మార్గం. ఆయన మార్గంలో ఆయనతో నడవడానికి, యవ్వనస్తుని పిలిచిన యేసు నేడు మనలను పిలుస్తున్నాడు. ధనాన్ని నమ్ముకొని యేసును వెంబడించుటకు నిరాకరించిన యవ్వనస్తుని వలె మనముండక, క్రీస్తును సంపాదించుటకు తనకున్నదంతా నష్టపరచుకొనిన పౌలు వలే ఈ లోకంలో జీవించుటయే, మనం పెంపొందించుకోవల్సిన వాక్యానుసారమైన ఆధ్యాత్మికత.

**పత్రిక పాఠం: ఫిలి. 3:1-16; ఆధ్యాత్మిక అనగా సంపూర్ణులమవుటకు సాగిపోవడం**

క్రైస్తవ ఆధ్యాత్మికత అంటే క్రీస్తుతో ఐక్యానుభవం. ఆ అనుభవాన్ని సంపూర్ణంగా పౌలు కలిగి ఉన్నాడు గనుక, నేను క్రీస్తును బోలి నడచుకొనునట్లు మీరు నన్ను బోలి నడచుకొనుడి అనగలిగాడు. క్రీస్తునంగీకరించనంత వరకు ప్రతివారు తాము చాల భక్తి గలవారను కుంటుంటారు. పౌలు కూడా అలాగే అనుకున్నాడు. అతిశయించాడు కూడా. మతం పేరిట,

సంఘాన్ని హింసించాడు. అయితే యేసును తెలుసుకున్నాక. తానేమయ్యున్నాడో, వాస్తవాలేమిటో, తనగమ్యమేమిటో, లోకం తప్పేమిటో దానిని ఎలా సరిచేయవచ్చో తెలుసు కున్నాడు. అంటే విశ్వాన్ని గూర్చిన సరియైన దృష్టిని పొందాడు.

క్రీస్తును గూర్చిన జ్ఞానము కంటె, ఒకరు పొందగలిగిన అతి శ్రేష్ఠమైనది లోకంలో ఏది లేదని తెలుసుకున్నాడు. దానిని పొందడానికి తన దగ్గర ఉన్నదంతా నష్టపరచుకోవడానికి కూడా వెనుకాడలేదు. క్రీస్తునంగీకరించనంత వరకు తన గోత్రమును బట్టి, పరిసయ్యుడైనందుకు మరియు తనకున్న ఆసక్తిని బట్టి అతిశయించాడు. అయితే యేసును కలిసాక ఇవన్ని తనను దేవునితో సరిచేయలేవని, నీతి దేవుని దగ్గర నుండే వస్తుందని తెలుసుకున్నాడు. ఆయనను అంగీకరించినపుడు మన పాపమునకు బదులు తన నీతినిస్తాడని తెలుసుకున్నాడు. జీవితమంటే క్రీస్తే అని, జీవించడానికి శక్తి ఆయనతో ఐక్యానుభవం ద్వారానే వస్తుందని, ఆయన దేని కొరకు తనను పిలిచాడో ఆ పని చేయడమే తన జీవిత ఉద్యోగం అని ఆ పని నెరవేరిస్తే ఉన్నతమైన బహుమానము పొందవచ్చని తెలుసుకున్నాడు. యేసును రక్షకుడిగా స్వీకరించినపుడు, ఆయన మరణానుభవంలో పాలివారమవుతాం, అనగా ఆయనతో సిలువ వేయబడి, పాత జీవితానికి మరణిస్తాం. బాప్తిస్మం నీళ్ళలోనికి వెళ్ళునపుడు ఆయనతో పాతిపెట్టబడతాం. నీళ్ళలోనుండి బయటకు వచ్చినపుడు, ఆయనతో పునరుత్థాన అనుభవంలో నూతన జీవం పొంది నిత్యం జీవించుటకు తిరిగి లేస్తాం. అలా తిరిగి లేచినవారు పైనున్న వాటినే వెదుకుతూ సంపూర్ణులవుటకు సాగిపోతారు. కనుక క్రైస్తవ ఆధ్యాత్మికత అంటే, దేవుని యందలి విశ్వాసమును కాపాడుకొనుచూ, శత్రువు సాతాను తోటి పోరాటంలో దావీదు వలే మంచి పోరాటం పోరాడుతూ, సువార్త సాక్ష్యమిచ్చుట అనే పరుగును తుదముట్టించి జీవకిరీటం పొందుటయే, అంటాడు పౌలు (ఫిలిప్పీ 3:12-16, అ.కా. 20:23-24, గలతీ 2:20-21). మనం రాతియుగంలో ఉన్న అత్యాధునిక సాంకేతిక యుగంలో ఉన్నా, మనం పెంపొందించుకోవల్సిన ఆధ్యాతికత ఇదే. కనుక అందరం ఈ తాత్పర్యము కలిగి సంపూర్ణతలోనికి సాగిపోదాం !

**జీవితానికి అన్వయం -** క్రైస్తవ జీవితం విశ్వాసంతో మొదలవుతుంది. బహుమానం పొందుతామన్న నిరీక్షణతో, ప్రేమ కలిగి ప్రయాసపడుతుంది.

**అనుదిన ధ్యాన సూచనలు.**

**సోమవారం :** 2 ది. వృ. 29:1-17 ధ్యానించండి. హిజ్కియా దేవాలయాన్ని ఏ విధంగా శుద్ధి చేసాడు?





**మంగళవారం :** 1 పేతురు 2:1-10 ధ్యానించండి. 5,10 వచనాలలో విశ్వాసులేమ య్యున్నారు? వారేమి చేయాలి?

**బుధవారం :** అ.కా. 2:77-47 ధ్యానించండి. ఆదిసంఘము యొక్క ప్రత్యేకత ఏమిటి? దిన దినం ఆ సంఘంలో క్రొత్తవారు చేర్చబడ్డారు? మన సంఘంలో అది జరగదెందుకు?

**గురువారం :** 2ది.వృ. 34:8-21 ధ్యానించండి. ఆలయం బాగు చేసినపుడు, వారు కనుగొన్నదేమిటి? నేడు మన జీవిత మందిరాలలో కూడా ధర్మశాస్త్రము మూల పడవేయబడి ఉందా? బైబిలు మూసివేయబడి ఉందా? రోజు తెరచి చదివి, ధ్యానించండి.

**శుక్రవారం :** యూదా 17-29 ధ్యానించండి. ప్రభువైన యేసుక్రీస్తు అపొస్తలులు పూర్వమందు చెప్పబడిన మాటలు ఏవి?

**శనివారం :** యోహాను 2:12-22 ధ్యానించండి. దేవాలయంలో నిత్యం ఏమి జరగాలి? అక్కడ ఏమి జరుగుతుండడం యేసుచూసాడు? మన జీవిత దేవాలయాలలో ఏమి జరగాలి? అది జరుగుతుందా?

**26-10-08** **సంస్కరణ ఆదివారం**

## మన విశ్వాసమును సరిచేసుకుందాం !

**(2 ది.వృ. 34:8-21, కీర్తన 112, యూదా 17-24, యోహాను 2:12-22)**

**స్తుతి ఆరాధన : కీర్తన 112**

మనో శాస్త్రవేత్తలు కొన్నింటిని గురించిన భయాలను ఫోబియాలంటారు. కొంతమందికి ఎత్తు అంటే భయం (అక్రో ఫోబియా) కొంతమందికి తలుపులు వేయబడిన ప్రదేశాలంటే భయం (క్లస్టరో ఫోబియా). ఆ విధంగా కొంతమందికి నీళ్ళంటే, కుక్కలంటే మరియు వ్యక్తులంటే కూడా భయం. అయితే అన్నింటిని పారద్రోలే భయం ఒకటి ఉంది. అదే దేవుని యందలి భయం. దేవునికి స్తోత్రం. యెహోవా యందు భయభక్తులు కలవాడు, ఆయన ఆజ్ఞలను బట్టి అధికంగా ఆనందించువాడు ధన్యుడు. దేవుని యందలి భయం

1. ఆర్థికపరమైన భయాలను పారద్రోలుతుంది. (కలిమి సంపద మన ఇంట ఉంటాయి - 3వ.).

2. చీకటిని గూర్చిన భయాన్ని పారద్రోలుతుంది. ఎందుకంటే చీకటిలో వెలుగు పుడుతుంది గనుక - 4వ.

3. భవిష్యత్తును గూర్చిన మరియు మార్పును గూర్చిన భయాన్ని పారద్రోలుతుంది. ఎందుకంటే మనం కదిలింపబడం కనుక - 6వ.

4. దుర్వార్తలను గూర్చిన భయాన్ని పారద్రోలుతుంది. ఎందుకంటే, ఆ భయం ఇక ఉండదు - 7వ.

కనుక ప్రతి విధమైన భయాన్ని దేవుని యందలి భయంతో మనం పారద్రోలవచ్చు. ఈ విధంగా నిర్భయులంగా జీవించడమే ఆయనను ఆరాధించడం.

## సందేశం

దేవుడు పూర్వకాలమందు, నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మాట్లాడాడు (హెబ్రీ 1:1). ప్రవక్తలు సమూయేలుతోనే రంగంలోనికి వస్తారు. అంతకు ముందు యెహోవా వాక్యము అబ్రాహామునకు దర్శనమునందు వచ్చినట్లుగా ఆది. కా. 15:18, యెహోవా అతనికి ప్రత్యక్షమైనట్లు ఆది. కా. 17:1లో మమ్రే దగ్గర సింధూర వనములో, యెహోవా అతనికి కనబడినట్లుగా ఆది. కా. 18:1లో, యెహోవా అబ్రాహాముతో మాటలాడుట చాలించి వెళ్ళిపోయినట్లుగా ఆ.కా. 18:33లో మనం చూస్తాం. అంతకు ముందు ఓడని నిర్మించమనినపుడు ఏ విధంగా దేవుడు నోవహుకు ప్రత్యక్షమయ్యాడో తెలియదు. ఇస్సాకుకు దేవుడు ప్రత్యక్షమైనట్లుగా వాక్యములో ఉంది (ఆ.కా. 26:2,24). బేతేలులో యాకోబుకు దర్శనములో యెహోవా ప్రత్యక్షమయ్యాడు (ఆ.కా. 28:15) యోసేపు దగ్గరకు వచ్చేసరికి, యెహోవా అతనికి తోడై యుండెను, అన్నమాట చాలాసార్లు చూస్తాం కాని, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులకు ప్రత్యక్షమైనట్లుగా, ముఖాముఖిగా యేసేపుకు ఎక్కడా తారసిల్లినట్లు వాక్యంలో లేదు. ఆ తరువాత కాలంలో, దేవుడు మోషేకు తన నామమును తెలియజేస్తూ, మండుచున్న పొదలో, హోరేబు పర్వతము మీద ప్రత్యక్షమైనట్లుగా చూస్తాం (నిర్గమ 3:14). ఈ కాలంలోనే దేవుడు తన ప్రజల మధ్యలో నివాసం చేయాలని ఆశించాడు. అందుకే ప్రత్యక్ష గుడారాన్ని నిర్మించు విషయంలో అందులో ఉండవలసిన ఉపకరణాలన్నిటి విషయంలో మోషేకు, విపులంగా వివరించాడు (నిర్గమ 25:89). ఆ తరువాత దావీదు దేవుని కొరకు ఒక ఆలయాన్ని నిర్మించాలనుకొన్నా, సొలొమోనును ఆ పని చెయ్యమన్నాడు.

తాను చెప్పినట్లుగా మోషే ప్రత్యక్ష గుడారమును నిలువబెట్టినపుడు, సొలోమోను ఆలయాన్ని ప్రతిష్ఠించినపుడు యెహోవా తేజస్సు మందిరమును నింపెను అని, యెహోవా తేజో మహిమ మందిరములో నిండుకొనెను అని మనం చూస్తాం (నిర్గమ 40:34, 1 రాజు 7:10). కాని, ఆ తరువాత రోజులలో, అనేకసార్లు దేవాలయం అనేక దినాలు మూసివేయబడియున్నట్లుగా





చూస్తాం. రాజైన హిజ్కియా కాలంలో అతడు తలుపులు తీసి, అందులో ఉన్న నిషిద్ధ వస్తువులను బయట పారవేసి, మళ్ళీ దేవాలయాన్ని ప్రతిష్ఠ చేస్తాడు. అతని తరువాత యోషీయా కూడా దేశమును మందిరమును పవిత్రపరచుటకు పూనుకొనినట్లుగా నేటి పాత నిబంధన పాఠంలో చూస్తాం. నేటి సువార్త పాఠంలో, యేసు ప్రభువు కాలంలో, దేవుని ఇల్లుగా మరియు ప్రార్థనా మందిరముగా ఉండవలసి ఆలయం, వ్యాపారపుటిల్లుగా, దొంగల గుహగా మారియుండుట చూచి, దానిని శుద్ధి చేసాడు యేసు ప్రభువు. అంత్య దినాలలో ఈలాటి పరిస్థితులు వస్తాయి గనుక, తమకు అప్పగించిన బోధ నిమిత్తము, పోరాడుతూ, దేవుని ప్రజలు ఏ విధంగా దేవుని ఆలయమైన సంఘంను, కాపాడుకోవాలో నేటి పత్రిక పాఠంలో చూస్తాం.

## పాత నిబంధన పాఠం: 2 ది.వృ 34:8-21;
## దేవుని వాక్య ప్రకారం మన జీవితాలను దిద్దుకుందాం !

అక్టోబరు 31వ తారీఖు క్రైస్తవ సంఘ చరిత్రలో ఒక ప్రత్యేకమైన దినం. 16వ శతాబ్దములో ఇదే రోజు మార్టిన్ లూథర్ రోమన్ కెథలిక్ సంఘము వారు చేయుచున్న లేఖన విరుద్ధమైన క్రియలను ఎత్తి చూపుచు 95 అంశాలు గల పత్రికలను విటిన్ బర్గ్ గుడి తలపులకు కొట్టాడు. అప్పటి నుండి క్రైస్తవ్యం రోమన్ కెథలిక్కులు, ప్రొటస్టెంట్లు అను రెండుగా విభజింపంబడింది. లూథర్ ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని సంస్కరణోద్యమం అంటారు. లూథర్ ప్రతిఘటనలోని ముఖ్య అంశాలు ఏవంటే 1. రక్షణ కృప ద్వారా విశ్వాసము వలన కలుగును. 2. అన్ని విషయాలలో పరిశుద్ధ లేఖనాలే అంతిమ ప్రమాణం. 3. అందరు యాజకులే.

ఆనాటి రోమన్ కెథలిక్కు సంఘం పరిశుద్ధ లేఖనాలను విడిచిపెట్టి, లేనిపోని ఆచారాలకు, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ ఆధ్యాత్మికంగా, నైతికంగా బహు దిగజారిపోయింది. లేఖనాలలో లేని సిద్ధాంతాలను ప్రవేశపెట్టి, అమాయక ప్రజలను మభ్యపెట్టి, ఆలయ నిర్మాణానికంటూ, డబ్బును సంపాదించడానికి సంఘం తలపెట్టిన కార్యాలను, తీక్షణంగా లూథర్ ఖండించాడు. ఆధ్యాత్మికతకు బదులు, అరాచకం నెలకొన్న సంఘాన్ని, 16వ శతాబ్దంలో, మార్టిన్ లూథర్ అనే కొరడాను ఝుళిపించి, దేవుడు సంఘమను ఆలయాన్ని శుద్ధి పరిచాడు.

దేవుని నిబంధన ప్రజల చరిత్రలో ఇదేమి కొత్త కాదు. యెహోవాయే సత్య దేవుడని లోకానికి చాటించాల్సిన ఇశ్రాయేలు ప్రజలు, దేవుని ధర్మశాస్త్రమును ఉల్లంఘిస్తూ అనేకసార్లు యెహోవా దేవుని విసర్జించి, విగ్రహాలను పూజిస్తూ వచ్చారు. ఎల్లప్పుడు దీపము వెలుగుచుండవలసిన దేవాలయం, నిషిద్ధ వస్తువులతో నిండిపోయి, దీపస్తంభము పైన దీపాలు

వెలుగుతుండక పోవడమే గాక, నిత్యము ఆరాధన జరుగుతుండవలసిన ఆలయం బహు కాలము వరకు మూయబడి ఉండడం వాక్యంలో చూస్తాం.

16వ శతాబ్దంలో వెలుగైన వాక్య దీపము ఆరిపోయింది. అభిషిక్తులు తప్పించి వేరొకరు బైబిలు గ్రంథాన్ని చదువకూడదు అన్న శాసనం వెలువడింది. ఈ విధంగా సామాన్య జనుల జీవిత దేవాలయాలలో మరియు సంఘ దేవాలయంలో బైబిలు కనబడకుండా ఎక్కడో పడిపోయింది. యోషీయా కాలంలో, యాజకుడైన హిల్కియా ఎక్కడో మూలను పడియున్న ధర్మశాస్త్ర గ్రంథమును బయటికి తెచ్చాడు. అదేవిధంగా సామాన్య ప్రజల కందుబాటులో లేకుండా చేయబడిన బైబిలు గ్రంథాన్ని లూథర్ వెలికి తీసుకువచ్చి అందరు ఆ బంగారు గనిలోని సంపదను పొందే వీలు కలుగజేసాడు. ఎవరైతే ఆ బైబిలును తెరచి చదువుతారో, తామేమై యున్నారో తెలుసుకుంటారు. యోషీయ తన వస్త్రములను చింపుకున్నట్లు హృదయ పరివర్తన పొందుతారు. తమ అవిధేయతను ఒప్పుకుంటారు. జీవితాలయాలను, సంఘాలయాలను బాగు చేయడానికి పూనుకుంటారు. నేటి సువార్త పాఠంలోని యేసు ప్రభువుకున్న ఆసక్తి ప్రతి సంఘ సభ్యునికుంటే అతడు తన సంఘము దేవుని చిత్తము నెరవేర్చక పోతుంటే ఊరకుండడు. మార్టిన్ లూథర్ వలె సరిచేయడానికి పూనుకుంటాడు.

**సువార్త పాఠం: యోహా. 2:12-22; సంఘ పరిచర్య పట్ల ఆసక్తి కలిగి ఉందాం !**

మన తండ్రి ఆస్తిని దుర్వినియోగం చేస్తూ, దోచుకుంటుంటే మనం ఊరుకుంటామా? ఊరుకోము. అదే విధముగా, కుమారుడైన యేసు, తన తండ్రి ఆలయాన్ని వ్యాపారపుటిల్లుగా దొంగల గుహగా మార్చిన ఆనాటి మత వ్యవస్థపై కొరడా ఝుళిపించాడు. నేడు కూడా సంఘాల స్థితి అదే విధంగా లేదంటారా? వాక్య అధ్యయనం చేసే పాఠశాలలు, ప్రార్థనా మందిరములుగా ఉండవలసిన సంఘాలలో, రాజకీయాలు, కోర్టు వివాదాలు, నిధుల దుర్వినియోగం, ఆలయపు ఆస్తులను అమ్మివేయాలనుకోవడం, ఈ వార్తలే తప్పించి, ఆత్మల సంపాదన, సువార్త అందని చోట్లకు సువార్త చేరవేయడం, సభ్యులు దేవుని వాక్యాన్ని నేర్చుకొనేందుకు నెలా నెలా సెమినార్లు నిర్వహించడం, వీటి ఊసే ఉండదు. సర్వలోకమునకు వెళ్ళి, సువార్త ప్రకటించి, శిష్యులనుగా చేయుడి అన్న ప్రభువు ఉన్నతాజ్ఞను శిరసావహించుటకు ఎటువంటి ప్రయత్నాలుండవు. కాని పండుగలలో దేవాలయాలంకరణ, ఆర్భాటాలకు, ఎంతో ధనమును వ్యయం చేయడం మనందరికి తెలిసిన విషయమే. పండుగరోజు గుడిలో కూర్చొని వెళ్ళిపోతే చాలానుకొనే క్రైస్తవులు ఎంతో మంది.

పరిస్థితులు మారాలంటే మన పాపభూయిష్టమైన, దేవాలయాలు పడగొట్టబడాలి. అంటే





మన ప్రాచీన స్వభావం, సిలువకు కొట్టబడాలి. మనలోని అహం, చావాలి. అప్పుడే క్రీస్తు పునరుత్థాన బలమును మనం పొందగలం. ఏ రోజైతే మనం మన పాపాలను ఒప్పుకొని, క్రీస్తును రక్షకుడిగా అంగీకరిస్తామో, ఆ రోజు మనం క్రీస్తుతోటి ఐక్యానుభవంలో మరణిస్తాం. బాప్తిస్మం నీళ్ళలోనికి వెళ్ళినపుడు పాతిపెట్టబడతాం. నీళ్ళలో నుండి బయటకు వచ్చినపుడు, ఇంకెన్నటికి మరణమొందకుండుటకు క్రీస్తుతో కూడా జీవిస్తాం.

మరి మనం కూడా, తప్పు చేసిన వాళ్ళను యేసువలే శిక్షించవచ్చా? ఎప్పుడు అలా చేయకూడదు. యేసు దేవుడు గనుక ఆయనకు సంపూర్ణాధికారం కలదు. నేరస్తులను శిక్షించే అధికారం, పోలీసులకు, న్యాయమూర్తులకు ఉంటుంది. కనుక తప్పు చేసిన వాళ్ళను శిక్షించే అధికారం మనకియ్యబడలేదు. అయితే ఎవరైనా ఏ తప్పిదములోనైనా చిక్కుకొనిన యెడల ఆత్మ సంబంధులైన మనలో ప్రతివాడు తాను శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు సాత్వికమైన మనస్సుతో అట్టివారిని మంచి దారికి తీసుకురావలెనని అంటాడు పౌలు (గల. 6:2). ఈ రోజు దేవుడు మనలను కలిగి యుండమన్న ముఖ్యమైన వైఖరి ఏమంటే, ఆయన సంఘము పట్ల క్రీస్తుకున్న ఆసక్తి లాంటి ఆసక్తిని మనం కలియుండుట. అదే నేటి పత్రికపాఠం.

**పత్రిక పాఠం: యూదా 17-25; ఆత్మల రక్షణ భారం కలిగి యుందాం !**

దేవుని వాక్యం మరియు నిత్య జీవమను అత్యంత విలువైన సంపద క్రీస్తు అనుచరులకు ప్రసాదించబడినవి. అయితే నేడు చాలామంది దేవుని మరియు ఆయన అనుచరులకు విరోధంగా పనిచేస్తున్నారు. దేవుని సత్యాన్ని కుయుక్తితో, వంచనతో స్వలాభాపేక్షతో వక్రీకరిస్తున్నారు. అయితే దేవుని సత్యము నలుమూలలకు వెళ్ళడానికి మనం మోసుకొని వెళ్ళాలి. మరియు దానిని తప్పుడు బోధల నుండి కాపాడాలి. దేవుని కుమారునికి సమర్పించుకొన్న మనం చేయవలసిన అతి ముఖ్యమైన పని ఇది, అని యూదా తన పత్రిక ద్వారా విశ్వాసులకు హెచ్చరిస్తున్నాడు. మనకు అప్పగింపబడిన బోధ నిమిత్తం, పోరాడే సైనికులంగా మనం ఉండాలి. అంత్య దినాలలో, తమ భక్తిహీనమైన దురాశల చొప్పున నడచు పరిహాసకులుందురని ప్రభువు చెప్పిన మాటలను యూదా గుర్తు చేస్తున్నాడు.

మనకప్పగింపబడిన ఉపదేశ సారాంశం ఏమంటే, లేఖనాల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి బొందెను. సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవదినమున లేపబడెను. 1 కొరింథీ 15:3 ఇదే సువార్త. దీనిని నమ్మి తమ పాపము ఒప్పుకొని, క్రీస్తును అంగీకరించిన వారిలో క్రీస్తు ఆత్మ రూపములో జీవిస్తాడు. దీనినే తిరిగి

జన్మించుట, రక్షింపబడుట, నిత్య జీవానికి వారసులవుటగా వాక్యము తెలియజేయుచున్నది. యేసు ప్రభువు పండుగలను ఆర్భాటంగా చేసుకొండి అని చెప్పలేదు; నీతి జరిగించకుండా పండుగ దినాలలో పాటలు పాడడం, బలులర్పించడం నాకసహ్యం అంటాడు దేవుడు (ఆమోసు 5ఫ21-24). ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా గుడికి రమ్మనలేదు క్రీస్తు ప్రభువు. మారుమనస్సు పొందకుండా వస్తే, నా ఆవరణము త్రొక్కుటకు మిమ్ములను రమ్మన్న దేవుడు అంటాడు (యెష 1:12). ఆ విధంగా ప్రార్థన చేస్తే కూడా, ఆ ప్రార్థన ఆయన వినడంట (యెష 1:15). మారుమనస్సు పొందకుండా, దేవుడు మనలను గుడికి రమ్మనలేదు, పండుగలు చేసుకోమనలేదు. ప్రార్థన చేయమనలేదు. చందా ఇయ్యమనలేదు. ఆయన ఇచ్చిన ఒకే ఒక ఆజ్ఞ. నా మాటలు మీరు అంగీకరించిన యెడల నేను మీకు దేవుడనై యుందును మీరు నాకు జనులై యుందురు (యిర్మీ 7:22,23). ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్లు ఊరకున్నాడు. ఇప్పుడైతే, అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు (అ.కా. 17:35). పరలోక రాజ్యము సమీపించి యున్నది గనుక మారుమనస్సు పొంది సువార్తను నమ్మమంటున్నాడు (మత్త 3:17). ప్రభువా, ప్రభువా అని పిలిస్తే పరలోక రాజ్యం వెళ్ళం, "రక్షణ పొందాలి" అన్న దేవుని చిత్త ప్రకారము జీవించువారే వెళ్తారు (మత్త 7:21, 1 తిమో 2:4). ఇది చేయకుండా గుడికి వచ్చి వెళ్ళిపోయే వారు ప్రకృతి సంబంధులు, ఆత్మ లేనివారు. క్రీస్తు ఆత్మ లేనివాడు ఆయన వాడు కాడు (రోమా 8:9). మన విశ్వాస జీవితాలకు, సంఘ జీవితాలకు మూలరాయి క్రీస్తు. అంటే మొదట మనం ఆయనను రక్షకుడిగా స్వీకరించాలి. అప్పుడు ఆయన ముఖ్యమైన మూలరాయి అవుతాడు. ఆ తరువాత అపొస్తలులు, ప్రవక్తలు వేసిన అతి పరిశుద్ధమైన పునాది మీద అంటే వారి బోధ మీద మన ఆధ్యాత్మిక జీవితాలను కట్టుకోవాలి. అప్పుడు, ప్రతి కట్టడము ఆయనలో చక్కగా అమర్చబడి ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయాలుగా మనం మారతాం (ఎఫెసీ 2:20-22). ఆ దేవాలయాలలో నిత్యం పరిశుద్ధాత్మలో ప్రార్థనలు జరుగుతుండాలి. వ్యాపారలావాదేవీలు కాదు.

దేవుని మాట వినడం ఆయనను ప్రేమించుటకు నిదర్శనం (యెష 14:23,24), ఆ విధంగా దేవుని ప్రేమిస్తూ, ఒకరినొకరం ప్రేమించుకుంటూ (యోహాను 13:34) జీవించడమే దేవుని ప్రేమలో నిలుచునట్లు కాచుకొని యుండడం అని తెలియజేస్తున్నాడు యూదా.

సంఘం యొక్క మరియొక ముఖ్య బాధ్యత ఆత్మల రక్షణ. నశించు పోవుచున్న వారిపట్ల





అనగా నరకాగ్నిలో ఎవరు పడకుండా, వారిని కాపాడాలన్న భారంతో సంఘం సువార్త సేవ చేపట్టాలి. ప్రతి ఒక్కరూ ఈ పనిలోపాలిభాగస్తువ్వాలి.

శరీర సంబంధమైన అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రం ఒప్పుకొనక ప్రభువగు యేసుక్రీస్తు కనికరము కొరకు కనిపెట్టుచూ, జీవించాలని దేవుడీ రోజు మనలను హెచ్చరించుచున్నాడు. ఈ విధంగా జీవిస్తామని తీర్మానంతో, ప్రభువును అనుదినం శిష్యులుగా వెంబడించునపుడు, తొట్రిల్లకుండా మనలను కాపాడుతాడు. తన మహిమ ఎదుట ఆనందముతో మనలను నిర్దోషులుగా నిలువబెడతాడు.

ఇట్టి శక్తి గల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా, మహిమయు, మహాత్మ్యమును, ఆధిపత్యము, అధికారమును యుగములకు పూర్వమును, ఇప్పుడును సర్వయుగములకు కలుగును గాక ఆమెన్.

**జీవితానికి అన్వయం –** దేవుని వాక్యమును బట్టి మన జీవితాలను సంస్కరించుకొందాం! ఆత్మల పట్ల భారం కలిగి యుందాం.

**అనుదిన ధ్యాన సూచనలు.**

**సోమవారం :** ద్వి.కా. 6:4-9 ధ్యానించండి. క్రైస్తవ తల్లితండ్రుల ముఖ్య బాధ్యత యేమిటి?

**మంగళవారం :** కీర్తన 78:4-8 ధ్యానించండి. క్రైస్తవ తల్లితండ్రులు, తమ పిల్లలకు ఏమి తెలియజేయాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు?

**బుధవారం :** సామె. 22:1-6 ధ్యానించండి. బాలుడు నడువవలసినన త్రోవ ఏది? అది ఎవరు నేర్పాలి? ఏలా నేర్పాలి?

**గురువారం :** సామె 23:15-26 ధ్యానించండి. నిత్యము యెహోవా యందు భయభక్తులు కలిగి ఉండాలంటే ఏమి చేయాలి? దిదకా. 17:19-22 చూడండి.

**శుక్రవారం :** హెబ్రీ 12:1-13 ధ్యానించండి. మన పరలోకపు తండ్రి మనను ఎందుకు శిక్షిస్తాడు?

**శనివారం :** యెష. 6:1-14 ధ్యానించండి. యేసు ఈ లోకంలో తన చిత్తాన్ని నెరవేర్చుటకు చిన్న పిల్లలు కూడా కావాలి. అందుకనే చిన్న పిల్లల పరిచర్య సంఘంలో చాల ముఖ్యం. ఈ రోజు మన సండే స్కూలు టీచర్ల నిమిత్తం ప్రార్థన చేద్దాం !

## సంస్కరణోద్యమం

మతం మతి తప్పి మార్గం వీడినప్పుడు
నాయకులు గతి తప్పి నీతిని మరచినప్పుడు
అన్యాయం రోజువారి దినచర్యగా మారినప్పుడు
దైవం పేరుతో దోపిడీలు జరిగినప్పుడు

సహించుట పాపమని, ఎదిరించుట న్యాయమని
సాహసంతో సమాజమంతా ఒక్కటై నిలిచినప్పుడు
సంస్కరణోద్యమం ఊపిరి పోసుకుంటుంది
నూతన అధ్యాయానికి నాంది పలుకుతుంది

రక్షణ కృషి ద్వారా కలుగదని
కృపే దానికి మూలమని
జీవితానికి దిక్సూచి లేఖనాల సారమని
దైవం లేని ధర్మం నీతి లేని కార్యమని
అందరం ఒక్కటే అని ప్రభు యేసు యాజ'కులం' అని
ఎలుగెత్తి చాటాడు మార్టిన్ లూథర్ మహాశయుడు.

సంస్కరణ ఆవిష్కరణలు
ప్రతియుగంలో జరగాలి
వ్యవస్థలో చిక్కుకున్న క్రైస్తవ్యం
ప్రక్షాళనం చేయబడాలి
అప్పుడే సంఘం ఉప్పులా, వెలుగులా
సమాజాన్ని ఉద్ధరిస్తుంది
దేవుని నామానికి ఘనతను తెస్తుంది.

**డాక్టర్ దేవ కుమార్ సరిపెల్లి**

## పత్రిక సకాలానికి అందకపోతే Internet లో మీరు పొందవచ్చు

**సకాలానికి మీకు పత్రిక అందకపోతే మీరు Internet లోకి వెళ్ళి ఈ క్రింది Email I.D. ఓపెన్ చేసి, మీరు సందేశాలను పొందవచ్చు. మీ Email I.D.లు పంపిస్తే నేరుగా మీకే పంపిస్తాం.**

**vlutheranchurch@yahoo.co.in**

**srlutheranchurch@yahoo.co.in**

**password - jesuslives**

**ప్రధాన సంపాదకులు**




# అనుదిన పరిశుద్ధ లేఖన ప్రకాశం

విడి ప్రతి రూ. 10/-

**అక్టోబర్ 2008**



## సంస్కరణోద్యమ పితామహుడు
## మార్టిన్ లూథర్ (1483-1546)

నీతిమంతుడు విశ్వాసమూలంగా
జీవించును. రోమా. 1:17

**Book-Post**
**Printed matter only**

Place
Stamp
Here

*To*

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

అడ్రస్ :
**జ్యోతిప్రకాష్ ఈతకోటి**
ఇ.నెం.8-3-191/174, (71B)
వెంగళరావు నగర్, హైదరాబాద్-500 038
ఫోన్స్ : 040-23811211, సెల్ : 9391366670
ఇ-మెయిల్ : jpethakoti@gmail.com

For Private Circulation only

**Gamaliel Printers & Publishers. Ph : 27018467**